**1983 ఉగాది కథానికల పోటీలో రు. 116/-లు కన్సొలేషన్ బహుమతి పొందిన కథ!**

**ఆకాశం నెత్తురు కక్కుతోంది- దేన్నో దారుణంగా నమిలి మింగేసినట్టు. లేకపోతే ఆ నెత్తురెక్కడిది? సూర్యుడు బెదురు బెదురుగా పారిపోతున్నాడు. పక్షులు కూడా పరిగెత్తుతున్నాయి. అక్కడేదో జరిగే వుంటుంది.**



# పారిపోయినకల

పాపినేని శివశంకర్

కానీ నగరంలో ఎవ్వరూ పట్టించుకోరేం? కార్లూ, రిక్షాలూ, మనుషులూ ఎవరి దారిని వాళ్ళు మహా వేగంగా వెళ్ళిపోతున్నారు- వెనకెవరో తరుముతున్నట్టు. పరిగెత్తుతున్నారు చీమలపుట్ట పగిలినట్టు. అక్కడేం జరిగిందని ఒక్కడూ అడగడు. కనీసం ఒక్క నిమిషమైనా ఆగడు. ఎవడి ముఖంలోనూ ఏ విధమైన ఆసక్తీ కన్పించదు. సెంటర్లో ఎత్తైన దిమ్మమీద ఆ కానిస్టేబులూ స్టాప్ సిగ్నల్ పుచ్చుకు చేతులూపుతాడేగానీ ఏం జరిగిందో తెలసుకోడు.

వీళ్ళకేదో అయింది. అదేమిటో తేల్చుకోవాలి. సైకిల్ మీద హడావుడిగా వెళ్ళిపోతున్న ఒక మనిషిని హేండిల్ పట్టుకు ఆపాను.

"ఓ మనిషీ! ఎక్కడికి పోతున్నావ్?"

అతను నా వంక ఎగాదిగా చూశాడు.

"నిన్నేం చెయ్యన్లే. చెప్పు."

అతను దిక్కు మొహం వేసుకుని అటూ, ఇటూ దిక్కులు చూస్తూ ఉండిపోయాడు. నోట్లోంచి మాట పెగల్లేదు. నాకు కోపం వచ్చింది అమాంతం చొక్కా పుచ్చుకుని రెట్టించాను.

"నీ దారి మళ్ళిస్తాను. ఎక్కడికి పోతున్నావంటే మాట్లాడవేం?"

"ఇ.... ఇ.... ఇంటికి వెళ్ళాలి."

"ఇక్కడేం జరిగిందో అడక్కుండానే వెళ్ళిపోతున్నావే? అదుగో ఆకాశం ఎవణ్ణో మింగేసింది. నెత్తురు కన్పించడం లేదా? ఆ సంగతి కనుక్కుని వెళ్ళు. తలకిందులుగా మాత్రం వెళ్ళకు. తల బొప్పికడుతుంది." అని అతని సైకిల్‌ని ఒక్క తన్ను తన్నాను. అతనదే పరుగు.

ఈ సంగతేమిటో తేల్చాలనుకుని సెంటర్లో ట్రాఫిక్ కానిస్టేబుల్ నిల్చున్న దిమ్మమీదకి లంఘించాను. అతని చేతిలోని స్టాప్ సిగ్నల్ లాక్కుని హడావుడిగా పోయే జనానికి చూపిస్తూ అరిచాను.

"స్టాప్! స్టాప్! స్టాప్ వేర్ యువార్! ఎందుకిలా తలకిందులుగా పరిగెత్తుతారు? పైకిచూస్తే ఏంజరిగిందో తెలుస్తుంది. కాస్త ఆలోచించండి."

జనమంతా ఎక్కడివాళ్ళక్కడ దిగ్భ్రాంతితో నిల్చిపోయారు. కార్లూ, ఇతర వాహనాలూ ఆగిపోయాయి. ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇప్పుడు కొంచెం బాగుంది. వాళ్ళు కాళ్ళమీద నిలబడి ఆలోచించడానికి కాస్తంత వెసులుబాటు కలిగింది. కానీ ఆ కానిస్టేబుల్ నా చేతిలో సిగ్నల్ లాక్కుని వీపుమీద ఒక్కటిచ్చి కిందికి నెట్టేశాడు. దెబ్బ తగిలితే వాణ్ణి చంపేద్దామనుకున్నాను. కానీ దెబ్బ తగిలిందో, లేదో చూడ్డానికి వీపు కన్పించదు. అంచేత అతణ్ణి క్షమించేశాను.

కొంచెం దూరం నడిచాను. రోడ్డుపక్క నిలబడి అటూ, ఇటూ ఉరుకులు పరుగులెత్తిపోతున్న జనాన్ని చూస్తుంటే వాళ్ళెందుకలా తలకిందులుగా పరిగెత్తుతున్నారో నాకర్థం కాలేదు. ఒక్కడూ సరిగ్గా కాళ్ళ మీద నడవడం లేదు. నాకు ఆపుకోలేనంత నవ్వొచ్చింది. ఇక లాభంలేదు. వాళ్ళు సరిగ్గా నడిచేట్టు చేయాల్సిందే. జనం మధ్యకి ఒక్క గంతేసి రోడ్డుమీద తల పెట్టి కాళ్ళు పైకెత్తేశాను. కాళ్ళు నిలవలేదు. మళ్ళీ మళ్ళీ ప్రయత్నించి నిలబడగలిగాను. ఆశ్చర్యం! జనం ఇప్పుడు చక్కగా కాళ్ళ మీద నిలబడి వున్నారు. తలకాయలు సరిగ్గానే వున్నాయి. నా ప్రయత్నం ఫలిం

చిందో. లేదో అంతలోనే ఒక పోలీసు నా దగ్గరికి వచ్చాడు.

"ఏయ్ లేచి పక్కకు తప్పుకో. కార్లు పోవాలి" అని అరిచాడు.

"కలగంటున్నాను. కాసేపు ఓపిక పట్టు" అన్నాను ఎంతో మర్యాదగా.

కానీ అతనూరుకోలేదు. రెక్కపట్టి బలవంతంగా లేవదీసి లాఠీకర్ర ఝళిపించాడు. అతన్తో వాదించి ప్రయోజనం లేదు. "సరే చావండి" అని అక్కణ్ణించి పరుగుదీశాను.

* * *

ఆ సందులో చెత్తకుండీ దగ్గర కుక్కలు భయంకరంగా కాట్లాడుకుంటుంటే చూస్తూ నిలబడ్డాను. నాలుగైదు కుక్కలు కలిసి ఒకదాన్ని తరుముతున్నాయి. అది హఠాత్తుగా ఆగి వెనక కాళ్ళమీదకూర్చుని కాళ్ళసందున తోక ఇరికించి పళ్ళికిలించింది. తక్కిన కుక్కలు వెనక్కి తగ్గాయి. నేను నేరుగా దాని దగ్గరికి వెళ్ళాను.

"ఎందుకేడుస్తున్నావు?" అని అడిగాను.

"దౌర్జన్యం" అంది కుక్క.

మిగిలిన కుక్కల్ని తరిమికొట్టాను.

"అయితే నిన్న నాకో కలవచ్చింది. నీకు తెలుసా?"


దానికి తెలీదు. అంచేత నావైపు కుతూహలంగా చూసింది.

"నాతోపాటు రా. కల చూపిస్తాను—" అంటూ దాని తోక పుచ్చుకు లాక్కెళదామని ప్రయత్నించాను.

కానీ అది పళ్ళికిలించి ఏదో అంది. అంటే నాతో రాదన్నమాట. నాక్కోపం వచ్చింది. ఒక రాయి తీసుకుని దానిమీద విసిరాను.

నేను మెయిన్‌రోడ్డు మీదికి వచ్చేసరికి ఏదో పెద్ద ఊరేగింపు సాగుతోంది. ఊరేగింపు మధ్య టాపులేని కారుమీద ఎవరో మనిషి చేతులు జోడించి చుట్టూ చూసి పళ్ళికిలిస్తున్నాడు. మెడనిండా పూలదండలు. ముందూ వెనకా వున్న జనం ఎందుకో "ఎవరో వర్ధిల్లాలి" అంటూ కేకలు పెడుతున్నారు. ఆశ్చర్యం! అందులో ఒక్కళ్ళకీ మెడమీద తలకాయలేదు. మరి వాళ్ళెలా చూడగలుగుతారు? ఆ ఎవరో వర్ధిల్లడానికీ, కారుమీద ఆ మనిషి పళ్ళికిలించడానికీ తప్పకుండా ఏదో సంబంధం వుంది. అదేమిటో నాకర్థంకాలేదు. కానీ ఒకటి మాత్రం నిజం. ఆ వ్యక్తికి ఖచ్చితంగా చాలా పొడవైన తోకవుంది. దాన్ని వీపువెనక ఊపుకుంటూ వుండాలి. అతను వెనక్కి తిరక్కపోవడానికదే కారణం. నాకు తెలుసు. సమయం చూసి తోక ముందుకు తీస్తాడు. సందు దొరగ్గానే ఎవరిమీదకోదూకి కరుస్తాడు. పిచ్చి కుక్కపళ్ళలో విషం వుంటుంది. వళ్ళు పీకేస్తే

## పరిచయం



పుట్టింది గుంటూరు జిల్లా నెక్కల్లులో. వయస్సు ఇరవైతొమ్మిది. చదివింది గుంటూరులో. తెలుగు సాహిత్యాభిరుచి 1974లో బియ్యేలోనూ, 1976లో ఎమ్మేలోనూ ఆంధ్ర యూనివర్సిటీనుంచి గోల్డ్ మెడల్స్ సంపాదించి పెట్టింది. 1977 నుంచి తాడికొండలోని భగవాన్ శ్రీ సత్యసాయిబాబా కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా ఉద్యోగం.

మార్క్సిజం వన్నె మాత్రమే మార్చింది. కొ.కు.వన్నెంతో ప్రభావితం చేశారు. సాహిత్యం జీవితాన్ని ఆవిష్కరించి పరిష్కరించి సుగమం చెయ్యాలని నమ్ముతాను. "స్తబ్ధత × చలనం" రాబోయే కవితా సంపుటి. రచయితగా వన్నెక్కువగా ఆదరించింది ఆంధ్రజ్యోతి.

లూసన్, దోస్తోవ్‌స్కి నేపథ్యంలో రాసిన ఈ కథ what is and what ought to be ధ్వనింపజేసే ప్రయత్నం.

—పాపినేని శివశంకర్

ఎవరీన్నీ కరవడానికి అవకాశం వుండదు. పట్టకారు దొరికితే ఆ పని చెయ్యొచ్చు. జనం మధ్య జొరబడి ఎక్కడైనా పట్టకారు దొరుకుతుందేమో అని చచ్చేట్టు వెదికాను. వాళ్ళు కాళ్ళతో నన్ను తొక్కేశారు గానీ— పట్టకారు దొరకలేదు. ఈలోగా ఊరేగింపు దాటి పోనే పోయింది. పోతే పోనీ.

ఇంతలో రోడ్డు కవతల పెద్దషాపులోంచి సూటూ బూటూ ఉన్న ఆ పెద్ద మనిషి దర్జాగా తన కారుపద్దకి నడిచాడు. డోరు ముందు ఆగి సిగరెట్ పాకెట్‌తీసి ఓ డన్‌హిల్ వెలిగించాడు. డన్‌హిల్ పక్కనే అతని భార్య కాబోలు ఎటో చూపిస్తూ ఏదో అంటోంది. సిల్కు తూశారీ. మెళ్ళో రవ్వల నెక్లెస్. చేతికి బంగారం గాజులు. చేతిలో వానిటీ బ్యాగ్. పెదాలకి లిప్‌స్టిక్. మొహంనిండా మేకప్ రంగు. వాళ్ళ వెనకే పెద్ద పెద్ద ప్యాకెట్లు మోసుకొస్తున్నాడు. డ్రైవర్. ఆ సామాను కాక వాళ్ళదగ్గర ఇంకేమైనా ఉందేమో తెలుసుకోవాలి. గబగబా కారు దగ్గరికి వెళ్ళి "హలో డన్‌హిల్" అని పలకరించాను. డన్‌హిల్ తెల్లబోయి నావంక ఎగాదిగా చూశాడు.

"ఈ కారు నీదేనా?" అడిగాను.

"ఎస్" అన్నాడు గంభీరంగా.

"ఆ పాకెట్లు?"

"మావే."

"కారు?"

"నాదే."

"ఆవిడా నీదేనా?"

అనుమానంగా చూశాడు నావంక.

"పోనీ యిది నీదేనా?" అతని తలమీద చెయ్యిపెట్టి అడిగాను.

అతను బిత్తరపోయాడు. నాకింకా హుషారొచ్చింది.

"అన్నట్టు ఆవిడ ముఖం ఎక్కడుందో నీకు తెలుసా?"

అతనికి తెలీదు. అందుకే సమాధానం చెప్పకుండా ముఖం పక్కకి తిప్పుకున్నాడు.

"నాకు తెలుసు. చెప్పనా? ఆ వానిటీ బ్యాగ్‌లో దాచిపెట్టింది జాగ్రత్త. మారువడిపోతుందేమో. ముఖం లేకపోతే ఎలా గుర్తుపట్టగలుగుతావ్"

అతను నావంక వెర్రిగా చూస్తుండిపోయాడు. అతని చెయ్యి పట్టుకు దబాయించాను.

"ఈ సూటూ, కారూ, మొహం లేని భార్యా. ఆ సామానూ తప్ప ఇంకేమైనా ఉందా నీ దగ్గర? నిజం చెప్పు."

"..............."

"ఓయీ ట్రాన్స్‌పరెంటూ! నీ లోంచి నాకు అవతలి మనుషులూ, రోడ్లూ, కార్లూ కన్పించుచున్నవి. ఈ సామానుతో, సూటూ బూటుతో నిన్ను పూరించుకొనుము. ఫిల్ ద వాక్యూమ్. గో చెత్తకుండీ. నా కల నీకు చస్తే చెప్పను."

ట్రాన్స్‌పరెంట్ గబుక్కున కార్లోకి దూకి తలుపు దఢాల్న వేశాడు. కారు దడుచుకుని పరిగెత్తింది.

నాకల ఎక్కడైనా కన్పిస్తుందేమోననే ఆశతో రోడ్లన్నీ గాలిస్తున్నాను. ఏ మనిషిలోనైనా దాక్కుందేమో వెదికాను. దొరికిన ప్రతి కాగితం ముక్కనీ పరీక్షించాను. అది కన్పించలేదుగానీ ఎక్కణ్ణించో వాడు పరిగెత్తుకొచ్చి నా చెయ్యి పట్టుకున్నాడు. వాణ్ణి నేనెప్పట్నుంచో ఎరుగుదును.

"అన్నయ్యా! ఇంటికి పోదాం పద. మూడ్రోజుల్నుంచీ నీకోసం వెదుకు

తున్నాను" అన్నాడు వగరుస్తూ.

నేను మాట్లాడలేదు. ఎటో చూస్తూండి పోయాను.

"అమ్మ బతకలేదు. మొన్న రాత్రే చచ్చిపోయింది" అన్నాడు మెల్లగా.

వాడి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరుగుతున్నాయి. అతనెందుకేడుస్తాడు?

"మనం మాత్రం చచ్చిపోలేదా? ఎందుకేడుస్తావు?" అని ఓదార్చాను. వాడు ఏడుపు మానలేదు. వాడి కళ్ళింకా ఎరుపెక్కాయి.

"అక్క శవంతోపాటే దహనం చేశాం. పక్కింటివాళ్ళు సహాయం చేశారు. పోస్టుమార్టం చేస్తారేమోనని భయపడ్డాం. అక్క పర్సులో కొంత డబ్బు దొరికింది. దాంతో ఎలాగో తప్పించుకున్నాం."

"శవాన్నికూడా వుపయోగించుకున్నారా? మిమ్మల్ని....మిమ్మల్ని...." కోపంతో నాకు మాటలు రాలేదు.

"తప్పలేదు. ఆ విధంగా సంపాదిస్తుందని తెలీనంతకాలం ఆమె తెచ్చిన డబ్బు వాడుకోలేదా? అయినా అక్క తప్పేం వుంది? అమ్మా నాన్నా రోగిష్టివాళ్ళు మనం ఎందుకూ పనికిరాకుండా పోయాం. అక్కే మనకింత తిండి పెట్టింది ఇన్ని రోజులూ. ఆవిణ్ణి తిట్టిన వాళ్ళంతా మనల్ని పోషించారా? నాకెంతో కసిగా వుంది. అప్పులు తీరే మార్గం కన్పించడంలేదు. ప్రపంచంలో కనబడ్డ వాణ్ణల్లా నరికెయ్యాలని పిస్తోంది" అన్నాడు తీవ్రంగా.

వాడికళ్ళు చింతనిప్పుల్లా మండుతున్నాయి. వాడి కళ్ళ వెనకాల పీర్లగుండం వుండి వుండాలి. నా గుండెల మీద ఎవరో కూర్చున్నట్టుంది. శవం కాలిన కమురు వాసన నా ముక్కుకి సోకుతోంది. శవం....కాలిన కమురు కంపు.... కిరోసిన్.... అక్క.... పడుపు.... కడుపు.... కడుపు కోసం పడుపు.... పడుపులో కడుపు.... కడుపులా పడుపు....హాహ్హా

వాడు కళ్ళు తుడుచుకున్నాడు.


"నీకేదో కంపెనీ నుంచి ఇంటర్వ్యూ కార్డొచ్చింది. పదో తారీకు హాజరు కావాలట."

"నో పదికాదు. ముప్పైరెండు. ముప్పై ఒకటి తర్వాత ముప్పై రెండే. అంతే. ముప్పైరెండూ × ఇంటర్వ్యూ ఎంత? జీరో జీరో అంటే సీరో. ఇంటర్వ్యూకి నేనెందు కెళ్ళాలి? వాళ్ళకి తెలీని విషయాలన్నీ ఎందుకు చెప్పాలి? వెళ్ళను గాక చెప్పను. చెప్పనుగాక వెళ్ళను. నేనిచే వెళ్తాను" అంటూ వాడు చెయ్యి పట్టుకు వారిస్తున్నా వినకుండా ముందుకి కదిలాను. ఎందుకో నిస్సత్తువగా వుంది. అయినా వెళ్ళక తప్పదు. నా కలను వెదకక తప్పదు.

* * *

ఆ రోజు నా కలని కలుసుకోవడంకోసం బస్సెక్కి బయల్దేరాను. నా ప్రయాణం ఎప్పుడు ముగుస్తుందో తెలీదు. పక్కనే ఎవరో మనిషి కూర్చుని వున్నాడు. కంటికి కన్పించనంత దూరంగా కూర్చునివున్నాడు. సెంటు వాసన తప్ప మనిషి వాసన రావడం లేదు. కిటికీలోంచి తల బయటికి తిప్పి దాటిపోతున్న షాపులవంక, వాహనాల వంక చూస్తున్నాడేగాని పక్కనే వున్న నా వంక కనీసం ఓరగా నన్నా చూడలేదు. అంటే నా కల గురించి అతనికేమీ తెలీదు. తెలిస్తే నాతో ఎంతో సంతోషంగా మాట్లాడేవాడే. కనీసం తనకు తెలీదన్న విషయమైనా నాతో చెప్పలేదు. చైతన్యవంతమైన నా కల కంటే అతనికి షాపులూ, వాహనాలూ మిలమిలలాడే లైట్లూ రంగులే ఎక్కువ ఆసక్తి కలిగిస్తున్నాయన్నమాట. ఇదెంత మాత్రం సహించరాని విషయం.






"ఏమిటి తదేకంగా చూస్తున్నావ్?" అని ప్రశ్నించాను.

అతను సమాధానించలేదు. ఒకసారి తల తిప్పి నా వైపు వింతగా చూసి మళ్ళీ తల తిప్పి బయటికే చూడసాగాడు. మా ఇద్దరి మధ్య దాదాపు పందమైళ్ళ దూరం వుంది. అందుకే నా మాటలతనికి విన్పించలేదు. అయినా మళ్ళీ అడిగాను.

"ఓ మనిషీ! ఏమిటి చూస్తున్నావ్?"

"షాపులవంక చూస్తున్నాను. అయినా నీకెందుకు?" అని అతను విసుక్కున్నాడు. అంటే ఎలాగైతేనే, నా మాటలతనికి విన్పించాయి.

"షాపులు కదలవు. నేను కదుల్తున్నాను. మాట్లాడుతున్నాను. మరి నావైపు చూడవెందుకు?"

"ఏముంది చూడ్డానికి?"

"నా దగ్గర మాంచి కల వుంది. చూపించనా?"

అని జేబులు వెదుక్కున్నాను. కనబడ్డేదు. ఎక్కడో దాక్కుందని గుర్తొచ్చింది. అతనికి తెలీకపోయినా నవ్వుతాడెందుకో? బస్సు వెళ్తున్నకొద్దీ ఆ మనిషి నా నుంచి ఇంకా ఇంకా దూరంగా వెళ్ళిపోతున్నాడు. లేకపోతే అలా నన్నేమాత్రం పట్టించుకోకుండా మౌనంగా వుండిపోడు. ఆ దూరం తగ్గించకపోతే ఇద్దరం పడిపోతాం. అందుచేత నేను అతనికి దగ్గరగా జరిగాను. అతనికి గిట్టలేదు కాబోలు అటువైపు జరిగాడు. నేను మరికొంచెం జరిగాను. అతను మరింత అవతలికి జరిగాడు. నేను ఇంకొంచెం.... అతను మరికొంచె....ఎలాగైనా అతనికీ. నాకూ మధ్యవున్న ఎడం తగ్గించాల్సిందే.తగ్గిం....ధన్! ధన్! క్లాష్! అమ్మో!

బస్సు దేన్నో గుద్దుకుని తలకిందులైంది ఆ విసురుకి నేను రోడ్డుమీదపడ్డాను. సీటుకీ, స్టీరింగ్‌కీ మధ్య నొక్కుకుని అడుగో డ్రైవర్, కళ్ళూ నోరు తెరుచుకుని. తలలు పగిలి....ముక్కలు బద్దలై.... కాళ్ళూ చేతులూ విరిగి....గిలగిలా తన్నుకుంటూ........మూల్గులూ ఏడుపులూ.... రక్తంలో నానిన రోడ్డు. రక్తంలో ముద్దగా తడిసి మరోరూపం దాల్చిన మనుషులు. రోడ్డు మధ్యగా అదుగో ఆ మనిషి నెత్తురు మడుగులో గిలగిలా....వలవలా....చుట్టూ జనం. వందలాది జనం....పుట్టపగిలినట్టు. నేల ఈనినట్టు....ఈగలు ముసిరినట్టు. ప్రతివాడి ముఖంలోనూ ఆశ్చర్యం. కనీ, వినీ ఎరగని చక్కని దృశ్యాన్ని చూస్తున్న వింత అనుభూతి. కానీ....కానీ ఎవడి ముఖంలోనూ మరేదో నేనాశించే భావం కన్పించలేదు. ఎవడి ముఖంలోనూ నా కల కన్పించలేదు. అప్పుడూ నాకల కన్పించలేదు. హారర్! ఓ హారర్!! నా గుండెల్ని ఎవరో పిండుతున్నారు. నాలో ఏవో డైనమైట్లు పేలుతున్నాయి. నన్ను నులిమేసే కల. తినేసే కల.

....ఎవరెవరో కళ్ళముందు తెల్ల తెల్లగా చల్ల చల్లగా నడిచిపోతున్నారు ఏ పొరలూ ఆచ్ఛాదనలూ లేని మెరిసిపోయే మనుషులు. వాళ్ళ కళ్ళల్లో మహా కాంతి. పెదవుల్లో చెరగని చిరునవ్వు. చిన్న పిల్లల్లా కేరింతల్తో ఆటలాడుతూ, పాటలు పాడుతూ చెయ్యీ చెయ్యీ పట్టుకుని ఎక్కడెక్కడికో ఎగురుతూ పోయే మనుషులు. మనిషికీ, మనిషికీ మధ్య ఏమాత్రం ఎడం లేదు. అయినా ఎంత హాయిగా వుంది! నా భుజంమీద చెయ్యేసి నవ్వుతూ తమతో తీసుకుపోతున్నారు వాళ్ళు. వాళ్ళంతా ఎక్కడికి వెళుతున్నారో, ఆ ప్రయాణం ఎప్పుడు మొదలైందో ఎప్పుడు ముగుస్తుందో నాకు తెలీదు. చుట్టూ కటిక చీకటి. అయినా వాళ్ళకంటి వెలుగు చీకటిని ఛేదిస్తోంది. ముందు దారి చూపుతోంది. పర్వతాల్ని పగలేస్తూ, అరణ్యాల్ని అధిగమిస్తూ అనంతంగా ముందుకు సాగుతోంది. సముద్రం అలలు కాళ్ళని ముద్దు పెట్టుకుంటున్నాయి. చెట్ల ఆకులు గుసగుసలాడుతున్నాయి. ఎక్కడెక్కడో ఎగిరే పిట్టలు రెక్కలు టపటప లాడిస్తూ బుజాల మీద వాలి ఏవో కబుర్లు చెబుతున్నాయి. కళ్ళముందే శతకోటి సూర్యుళ్ళు. అనంత కోటి నక్షత్రాలు కనుమరుగవుతున్నాయి. ఎన్నో వేల లక్షల ఏళ్ళు గడిచిపోతున్నాయి. అయినా ప్రయాణం ఆగడంలేదు. అయినా ఎవరి ముఖంలోనూ అలసట లేదు. ఎవరికీ విశ్రాంతి లేదు. కొండల్లోంచి.అడవుల్లోంచి ఆకాశంలోంచి ఏవేవో కొత్త రూపాలు సృష్టి అవుతున్నాయి. ఎటు చూసినా శూన్యాన్ని నింపేసే ప్రేమ. పోటెత్తిన సముద్రంలా పొంగి పొర్లే ప్రేమ. హద్దుల్లేని శ్రమ. అంతటా ఎటుచూసినా తెల్లదనం. పసితనం. అలలెత్తే ఆనందం.... ఏదీ నా కల?

ఏదీ నా కల? ఎక్కడికి పారిపోయింది? ఎప్పుడు పారిపోయింది? కల దొరక్కపోతే నేనెలా బతకాలి? నా గుండెలు బద్దలవుతున్నాయి. నా కళ్ళు వర్షిస్తున్నాయి. ఆ రోడ్డు మీద రక్తం మడుగుల మధ్య నేను ఏడ్చాను. ఏడుపును వింతగా చూసే మనుషుల మధ్య భయంకరంగా ఏడ్చాను. నా కల నాకు దక్కాలి. అందరికీ దక్కాలి. దక్కకుండా అడ్డుపడుతున్న శక్తేదో దాన్ని ధ్వంసం చెయ్యాలి కన్పించకుండా పోయిన కలని మళ్ళీ సృష్టించాలి. ఎవడడ్డుపడినా సరే.

ఒక్క ఉదుటున నేల మీద నుంచి స్ప్రింగులా పైకి లేచాను. విచిత్రంగా చూస్తున్న వింత మనుషుల గుండెలదిరిపోయేలా వికటాట్టహాసం చేశాను. ప్రళయ తాండవం చేశాను. రక్తంతో రాళ్ళతో రప్పల్తో నడిరోడ్డు మీదనే నూతన సృష్టి ప్రారంభించాను సూర్యుడు నన్నభినందిస్తూ నవ్వుతున్నాడు. ఆకాశం నా వెన్ను నిమురుతోంది. విధ్వంసం! విధ్వంసం! నిర్మాణం! నిర్మాణం!

